సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 20 । జూన్ । 2025



ఇద్దరికి గాయాలు

టిప్పర్, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఇన్ముల్‌నర్వ లో చోటు చేసుకుంది. 10లో▸



దోపిడీ అరికట్టాలి

ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాంల దందాను అరికట్టాలని మాల మహానాడు నేతలు డిమాండ్ చేశారు. 10లో▸



భక్తిభావం కలిగి ఉండాలి

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ పేర్కొన్నారు. 10లో▸

అటు భరోసా ఇటు రసాభాస!

కర్షకుల ఖాతాల్లో పంట సాయం జమ

• మాకెందుకు రాలేదంటూ ఔటర్ సమీప రైతుల ఆందోళన • బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మద్దతు

ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఓ వైపు తమ ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని అన్నదాతలు హర్షం వ్యక్తంచేస్తుండగా.. ఔటర్ సమీపంలోని మండలాల రైతులు ఆందోళన బాట పట్టారు. తమకు పంట సాయం అందలేదని మండిపడుతున్నారు. వీరికి ప్రతిపక్ష నాయకులు మద్దతు తెలపడంతో గందరగోళ వాతావరణం నెలకొంది.



ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వానాకాలం పంట సాయం కింద రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. రైతు భరోసా పేరుతో అర్హులైన అకౌంట్లలో డబ్బులు వేస్తోంది. తొలి రోజు రెండు ఎకరాల లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయగా, రెండో రోజు మూడు ఎకరాలు, నాలుగో రోజు నాలుగు ఎకరాలు, ఐదో రోజు ఐదెకరాలోపు భూములు ఉన్న వారికి నగదు పంపిణీ చేసింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా అర్బన్ మండలాల రైతులు మాత్రం నిరాశకు గురయ్యారు. ఓఆర్‌ఆర్‌కు ఇరువైపులా ఉన్న మెజార్టీ పొలాలు వ్యవసాయేతర భూములుగా మారడం, ఖాళీ భూముల్లోనూ పంటలు లేకపోవడం, మార్కెట్లో వీటికి మంచి ధర లభిస్తుండటంతో ప్రభుత్వం ఆయా మండలాల్లోని రైతులకు గత యాసంగి నుంచే ఈ పథకం అమలును నిలిపివేసింది. ఇతర రైతులకు మాత్రం ఎకరానికి రూ.ఆరు వేల చొప్పున ఖాతాల్లో జమ చేసింది. ఈ నగదును వానాకాలం పెట్టుబడుల కోసం వినియోగించాలని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్నారు.

రంగారెడ్డిలో చెల్లింపులు ఇలా..

తేదీ	విస్తీర్ణం	రైతులు	ఖాతాల్లో నగదు జమ
16	2 ఎకరాలు	1,54,622	రూ.81,34,19,493
17	3 ఎకరాలు	1,87,435	రూ.12,78,89,726
18	4 ఎకరాలు	2,06,736	రూ.165,95,67,080
19	5 ఎకరాలు	2,19,938	రూ.199,35,21,916

వికారాబాద్‌లో

తేదీ	విస్తీర్ణం	రైతులు	ఖాతాల్లో నగదు జమ
16	2 ఎకరాలు	1,62,596	రూ.98,99,42,656
17	3 ఎకరాలు	2,05,637	రూ.163,74,49,371
18	4 ఎకరాలు	2,30,844	రూ.216,60,10,315
19	5 ఎకరాలు	2,48,374	రూ.264,21,56,042



మంత్రిని కలిసి బయటకు వస్తున్న నేతలు

❖ అందరికీ ఇవ్వండి

అబ్దుల్లాపూర్‌మెట్: జిల్లాలోని మెజార్టీ రైతులకు భరోసా పథకం అందలేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి సబితారెడ్డి, రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. పంటల సాగు కోసం తక్షణమే రైతుల ఖాతాల్లో నగదు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, సహకార సంఘం మాజీ చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి, కోటా వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

❖ 'పట్నం'లో రాస్తారోకో

ఇబ్రహీంపట్నం: ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న మండలాల వారికి రైతు భరోసా పంటసాయం నిలిపేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నేతలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్కా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం మండలాల రైతులకు రైతుభరోసా నిధులను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే నిధులు విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు చేరుకుని బీజేపీ నేతలను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు పోరెడ్డి నర్సింహ్మారెడ్డి, నోముల దయానంద్‌గౌడ్, ముత్యాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల దరఖాస్తుకు నేడే ఆఖరు

కందుకూరు: నేదునూరు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులు శనివారం సాయంత్రం వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 23న మధ్యాహ్నం 2గంటలకు రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తహసీల్‌లో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



తహసీల్దార్ సురేందర్‌తో మాట్లాడుతున్న కిరణ్ కుమార్ రెడ్డి

శంకర్‌పల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి గురువారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. జన్వాడలో తాను కొనుగోలు చేసి ఎకరా ఇరవై గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తవగానే వెళ్లిపోయారు. పలువురు ఆయనతో ఫొటోలు తీసుకునేందుకు ఉత్సాహం చూపించారు.

భావి ప్రధాని రాహుల్ గాంధీ



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: భారత భావి ప్రధాని రాహుల్‌గాంధీ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రాహుల్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహించి భారత్ జోడో యాత్ర ద్వారా.. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ళ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా పుష్పవతి



పుష్పవతికి నియామక పత్రం అందజేస్తున్న జ్యోతి

మొయినాబాద్: హిమాయత్‌నగర్‌కు చెందిన ముత్యాల పుష్పవతి మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం అధ్యక్షురాలు పామెన జ్యోతి నుంచి నియామకపత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పుష్పవతి తెలిపారు.

ప్రభుత్వ విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ తదితరులు

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు, దాతల ప్రోత్సాహం ఎంతో అవసరమని ఎంఈఓ మల్లయ్య అన్నారు. స్వేచ్ఛ ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం మొయినాబాద్ స్కూల్‌లోని 250 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పలకలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవ్, ఫౌండర్ సభ్యులు శేషగిరిరావు, హెచ్‌ఎంలు జోసఫ్‌రెడ్డి, హమీద్, శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత

నాణ్యమైన పాలే సేకరించాలి

• టీజీడీడీసీఎఫ్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత
• కడ్తాల్‌లో పాడి రైతులకు అవగాహన సమావేశం

కడ్తాల్: పాడి రైతుల నుంచి నాణ్యమైన పాలు సేకరించాలని తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య (టీజీడీడీసీఎఫ్) చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత సూచించారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని సొసైటీల అధ్యక్షులు, వేతన కార్యదర్శులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయ డెయిరీ ద్వారా సేకరించే పాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. పాలు నాణ్యంగా ఉంటేనే వినియోగదారుల మెప్పు పొందగలమని చెప్పారు. కడ్తాల్ పాల శీతలీకరణ కేంద్రం పరిధి నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా నిత్యం 30 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఇందులో 3.5, 3.6 ఫ్యాట్ మాత్రమే ఉంటోందన్నారు. వీటిని బయట మార్కెటింగ్ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పాడి ఆవులు, గేదెలకు సరైన దాణా అందించాలని సూచించారు. ఇకనుంచి 8.3నుంచి 8.5 ఎస్‌ఎన్‌ఎఫ్ ఉండేలా చూడాలన్నారు. 8.3 కన్నా తక్కువగా ఉన్న పాలు సేకరణకు యోగ్యం కావని స్పష్టంచేశారు. పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ బాబు బేరి మాట్లాడుతూ.. పాడి పోషణ, పశువులకు అందించాల్సిన పోషకాహారం, పాల నాణ్యతకు సంబంధించిన అంశాలను సమగ్రంగా వివరించారు. విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి మాట్లాడుతూ.. పాల సేకరణ, నాణ్యత, నిల్వ, రవాణా అంశాలపై అగవాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేనేజర్ ఉదయశ్రీ, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, వివిధ పాల కేంద్రాల సొసైటీ అధ్యక్షులు, పెయిడ్ సెక్రటరీలు, రైతులు, డెయిరీ సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకే సబ్‌ప్లాన్ నిధులు

• దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు
• ప్రతీ నెల చివరి శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి
• రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్య

అనంతగిరి: ప్రతీ మూడు నెలలకు ఓసారి డీవీఎంసీ (డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని జిల్లాలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి వివిధ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు వెచ్చిస్తున్న నిధులపై కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. జనాభా ప్రాతిపదికన వాటాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలు పరిష్కారం చూపాలన్నారు. జూలై నుంచి ప్రతీ నెల చివరి శనివారం పౌర హక్కుల దినం నిర్వహించి ఈ కార్యక్రమానికి తహసీల్దార్, పోలీస్ అధికారి తప్పక హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు సూచించారు. చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్ పథకాల్లోనూ వాటాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మౌనమేలనో..

• నగరంలో వెలుగులోకి నకిలీ వైద్యుల ఘటనలు
• అనధికార ఆస్పత్రులపై 150కి పైగా కేసులు
• చర్యలకు వెనకాడుతున్న ఉన్నతాధికారులు
• తథావిధిగానే అనధికార ఆస్పత్రుల కార్యకలాపాలు

☛ నగరంలోని వనస్థలిపురంలో వెంకటేశ్వర క్లినిక్‌పై దాడులు నిర్వహించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందాలు రెండు దఫాలు కేసులు చేశాయి. తదుపరి చర్యల కోసం సంబంధిత దస్త్రాలను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాయి. కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

☛ నిజాంపేట్ కేర్ అండ్ క్యూర్ సీజ్ ఆస్పత్రిని సీజ్ చేశారు. తాజాగా అనధికారికంగా మెడికల్ దుకాణం నిర్వహిస్తున్నారు, నిజాంపేట్ పరిధిలో శ్వేత క్లినిక్ సీజ్ అయినా నిబంధనలకు విరుద్ధంగా తిరిగి ఓపెన్ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.

☛ ఉప్పల్‌లో ఎలాంటి అర్హతలు లేని వ్యక్తి వైద్యం అందించడంతో రెండు రోజుల క్రితం జిమ్ ట్రైనర్ కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందారు.

– సాక్షి, సిటీబ్యూరో

అర్హత లేకున్నా వైద్యం చేయడం, అనుమతులు లేకున్నా క్లినిక్‌లు, ఆస్పత్రులను నిర్వహించడం.. ఇలా కొందరు నకిలీ వైద్యులు రెండు చేతులా కాసులు సంపాదిస్తూ.. అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరంలో నకిలీ వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలు కొన్నేళ్లుగా ఇదే పంథా కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు తనిఖీలు విస్తృతం చేశారు. ఫిర్యాదులపై స్పందిస్తున్నారు. సదరు క్లినిక్‌లపై దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు అప్పగిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు కథ ఇక్కడే మొదలవుతోంది. కేసులు నమోదైన తర్వాత నకిలీ వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకునే నాథుడే కనిపించడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా కేసులు దస్త్రాలకే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మీనమేషాలు లెక్కిస్తున్న యంత్రాంగం..

◆ గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు సుమారు నాలుగు వేలు ఉన్నాయి. అనధికారికంగానూ వందల సంఖ్యలో క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల వైద్యులు తమకు సంబంధం లేని చికిత్సలు చేయడం, అసలు అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా చలామణి కావడం నగరంలో సర్వసాధారణమైంది.

◆ దీనిపై దృష్టి సారించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు దాడులు నిర్వహించి 150కిపైగా ఆస్పత్రులు, క్లినిక్‌లు, నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. తదుపరి చర్యల కోసం ఆయా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు అప్పగించారు. కేసులపై పూర్తి విచారణ చేపట్టి, చట్టం అతిక్రమించినందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది నిర్ణయించే అధికారం డీఎంహెచ్‌ఓ, డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఉంటుంది. ఈ కేసులను పరిశీలించి నిబంధనల అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఆయా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. డీఎంహెచ్‌ఓలకు పంపిన కేసులకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారో తిరిగి తమకు తెలియజేయాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సిబ్బంది కోరినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన కనిపించడం లేదు.

మేడ్చల్‌లో ఇలా.. రంగారెడ్డి జిల్లాలో అలా..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్ జిల్లాకు సంబంధించిన కేసుల్లో కొంత వరకు పురోగతి కనిపిస్తోందని, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న కేసులకు సంబంధించి అక్కడి వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని సంబంధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా మరో 18 కేసుల ఎఫ్‌ఐఆర్ నివేదికలను రంగారెడ్డి జిల్లా అధికారులకు పంపించినట్లు సమాచారం. వీటిపై చర్యలు తీసుకోవడానికి ఇంక ఎంత సమయం పడుతుందోననే ప్రశ్న ఉదయిస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

టీచింగ్ స్టాఫ్.. స్టాప్!



వైద్య కళాశాలల్లో బోధన సిబ్బంది కొరత

• పోస్టుల భర్తీపై ఎన్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం చెరో దారి
• వైద్య విద్య, రోగులకు సేవలు, పరిశోధనలపై తీవ్ర ప్రభావం
• గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, కేన్సర్, ఫీవర్ ఆస్పత్రుల్లో పని భారం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, కేన్సర్, ఫీవర్ ఆస్పత్రులు ఆరోగ్య ప్రదాయినులుగా నిలుస్తున్నాయి. ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వైద్య సేవల కోసం రిఫరల్ కేసులు పెద్ద సంఖ్యలో వస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యమున్న బోధనాస్పత్రుల్లో టీచింగ్ స్టాఫ్ కొరత వేధిస్తోంది. పోస్టులు భర్తీ చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 40 శాతం మంది వైద్యులు (టీచింగ్) పోస్టులు ఖాళీలు ఉన్నాయని సమాచారం. వైద్య కళాశాలకు అవసరమైన పోస్టులను జాతీయ మెడికల్ కౌన్సిల్ నిర్ణయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలతో కలిసి ఉన్న ఆస్పత్రి, అందులో పడకలు ఆధారంగా పోస్టులను కేటాయిస్తోంది. దీంతో ఈ రెండింటి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఫలితంగా మెడికల్ కళాశాలల్లో బోధన సిబ్బంది సరిపడా ఉన్నారంటే ఉన్నారు. లేరంటే లేరనే వాదనలు వినిపిస్తున్నాయి. సమర్థించుకునేవారు ఎన్‌ఎంసీ లెక్కలను చూపిస్తున్నారు. ఈ అంకెల ఆధారంగా చూస్తే కళాశాల అవసరాల కంటే ఎక్కువ మంది ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే.. రాష్ట్ర ప్రభుతకేటాయింపులను పరిశీలిస్తే మాత్రం అసలు విషయం వెలుగుచూస్తోంది. రోగులకు అందే సేవలు, వైద్య విద్యార్థుల తరగతులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ప్రస్తుతం పరిశోధనలపై ఫోకస్ చేసే అవకాశమే లేదని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు.

వైద్య సేవలపై ప్రభావం..

నగరంలోని ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉంటారు. సిబ్బంది కొరతతో నాణ్యమైన వైద్య సేవలు అందించే అవకాశం లేకుండాపోతోంది. బెడ్‌లు ఎక్కువ, వైద్యులు సంఖ్య తక్కువగా ఉండటమే దీనికి కారణంగా కనిపిస్తోంది. కొన్ని విభాగాల్లో ఒక్కరూ లేని పరిస్థితి. ఉదాహరణకు గాంధీ వైద్య కళాశాలకు ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం 147 మంది బోధన సిబ్బంది (ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్) ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మూడు కేటగిరీలు కలిపి 330 మందికిపైగా సిబ్బందిని కేటాయించింది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న వారు సుమారు 200 మంది ఉన్నారు. మిగతా 130 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ 2 వేల పడకల ఆస్పత్రి ఉంది. నిత్యం వేలాది మంది ఓపీ, ఐపీ ఉంటుంది. ఉస్మానియా పరిధిలోని ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ ఆస్పత్రుల్లోనూ సుమారు 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో ఉన్న వారిపై ఒత్తిడి పెరుగుతోందని చెబుతున్నారు. ఖాళీల ప్రభావం రోగులకు అందించే సరైన వైద్యం అందించే అవకాశం లేకుండాపోతోంది. రోగులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులకు సరైన బోధన అందుతోందా అంటే అదీ కష్టమే అంటున్నారు.

పరిశోధనలపై ఫోకస్ నిల్..

వైద్య కళాశాలల్లో బోధనతో పాటు రోగులకు అందించే వైద్య సేవలు, పరిశోధనలూ కీలకంగా ఉంటాయి. బోధనాస్పత్రుల్లో సిబ్బంది కొరతతో ఉన్న వారిపై ఒత్తిడి పెరుగుతోంది. పలు రకాల కమిటీల్లో సభ్యులుగా ఉండటం, పరిపాలనా విధులు అప్పగించడం వంటివి అదనపు భారంగా మారుతున్నాయని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు. పరిశోధనలు చేపట్టే అవకాశమే లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పరిశోధనలు ప్రారంభించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కావడంలేదని ఆరోపిస్తున్నారు. 2023లో చివరిసారిగా నియామకాలు చేపట్టారు. అనంతరం రెండేళ్లు కావస్తున్నా ఖాళీల భర్తీకి ఎలాంటి చర్యలు చేపట్టడంలేదంటున్నారు. కాగా.. కొంత మంది వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు.

కసాయి కొడుకుకు కటకటాలు

కన్న తండ్రిని హతమార్చిన కేసులో రిమాండ్

కందుకూరు: కన్నతండ్రినే అతి కిరాతకంగా హతమార్చిన ఘటనలో కొడుకును పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పులిమామిడి గ్రామానికి చెందిన భార్యాభర్తలు పసుపుల చిన్న జంగయ్య, పద్మమ్మలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరందరికి వివాహాలు చేశారు. గ్రామంలో ఉన్న అర ఎకరం పొలం దున్నుకుంటూ మరోపక్క గొర్రెలు మేపుకొంటూ జీవిస్తున్నారు. కాగా కొడుకు శేఖర్ తన భార్య పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్దనే ఉండేవాడు. ఏడాది క్రితం పాత ఇల్లు కూల్చివేసి కొత్తగా ఇంటిని నిర్మించే క్రమంలో భార్య పిల్లలతో కలిసి వేరే చోటుకి మారాడు. పిల్లర్లు, స్లాబ్ మాత్రమే వేసి ఆగిన ఇంట్లో తల్లిదండ్రులు ఉంటున్నారు. రాత్రిపూట తల్లి గ్రామంలో ఉండే చిన్న కుమార్తె ఇంటికి వెళ్లి నిద్రించేది. కాగా డబ్బులు లేక నిర్మాణం మధ్యలో ఆగడంతో ఉన్న అర ఎకరం పొలం అమ్మి ఇల్లు పూర్తి చేయాలని కొడుకు తరచూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడు.


నిందితుడు శేఖర్

పెద్దలు పంచాయితీ పెట్టి చెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. కాగా రెండు రోజుల క్రితం భార్య పిల్లలు పుట్టింటికి వెళ్లారు. దీంతో 17న రాత్రి తన తల్లిదండ్రులతో కలిసి శేఖర్ నిర్మాణంలో ఉన్న ఇంట్లోనే భోజనం చేశాడు. అనంతరం కొడుకు అద్దె ఇంటికి, తల్లి చిన్న కుమార్తె వద్దకు నిద్రించడానికి వెళ్లగా, చిన్నజంగయ్య అక్కడే నిద్రించాడు. ఇదే అదునుగా చూసుకుని అర్ధరాత్రి శేఖర్ తండ్రి వద్దకు వచ్చి బండరాయితో పాటు కర్రతో మోది హతమార్చిన ఘటన విదితమే. కాగా నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తూరు: టిప్పర్ లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో జేపీదర్గా రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన నరేష్(38) తన బంధువు(వృద్ధురాలు)తో కలిసి బైకుపై ఇన్ముల్‌నర్వ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. కాగా మార్గమధ్యలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా వెనకాల నుంచి వచ్చిన టిప్పర్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకొని పరిశీలించారు.


ఘటనా స్థలిలో క్షతగాత్రులు

ప్రైవేట్ బడుల దోపిడీ అరికట్టాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు, పెన్నులను అమ్ముతూ దందాను కొనసాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు, అధిక ఫీజులు, అడ్మిషన్ పేరిట రూ.లక్షలు వసూళ్లు చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ప్రైవేటు పాఠశాలలను గుర్తించి వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించకుండా పేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని మండిపడ్డారు.


డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మహేశ్

అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీలో అడ్మిషన్లు

ఇబ్రహీంపట్నం: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, సహాయ కేంద్రం కో–ఆర్డినేటర్ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 13 వరకు గడువు ఉన్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలల్లో ఇంటర్(తత్సమాన) అర్హత కలిగిన వారుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 29772 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వాటర్‌మెన్ మృతి

మొయినాబాద్: మద్యం మత్తులో అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఉరివేసుకుని వాటర్‌మెన్ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన చిన్న బత్తిని కృష్ణ(38) వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా ఆయన మద్యానికి బానిసయ్యాడు. బుధవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో మద్యం మత్తులో ఇంట్లోనే చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శ్రీధర్ రావుపై కేసు నమోదు

గచ్చిబౌలి: సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావుపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రోడ్లపై హైడ్రా అధికారులు సర్వే నిర్వహించి మార్కింగ్ చేసిన విషయం తెలిసిందే. దీనిని వీడియో తీస్తుండగా శ్రీధర్ రావు అతడి అనుచరులు తమపై బ్యాట్, కత్తితో దాడి చేశారని నటి రమ్యశ్రీ సోదరుడు ప్రశాంత్‌తో పాటు కుషీ చంద్ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టిన గచ్చిబౌలి పోలీసులు శ్రీధర్ రావు, అతని అనుచరుడు వెంకటేష్‌తో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేశారు.

పారిశ్రామిక పరుగులు


సేకరించిన భూములకు సంబంధించిన హద్దులను పరిశీలిస్తున్న టీజీఐఐసీ అధికారులు

రైతుల నిర్బంధాలు, ప్రతిఘటనలు, నిరసనగళంతో గతంలో అట్టుడికిన దుద్యాల్ మండలంలో ప్రస్తుతం పారిశ్రామికవాడ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అందులో సింహభాగం భూ సేకరణ జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.

భూ సేకరణలో వేగం పెంచిన అధికారులు

- నిర్ధారించిన హద్దులకు రంగులు
- ఇప్పటి వరకు సేకరించిన భూమి 914.12 ఎకరాలు
- మిగిలింది మరో 263.23 ఎకరాలే
- త్వరలో కంపెనీలకు అప్పగించే అవకాశం!
- పరిశీలించిన టీఎస్ఐఐసీ అధికారులు

దుద్యాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, పులిచర్లతండా, రోటిబండతండా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. నిత్యం ఏదో ఒక శాఖకు చెందిన ఉద్యోగులు వచ్చి భూములకు హద్దులు నిర్ధారిస్తున్నారు. ఎన్నో ఆటంకాల మధ్య సాగిన భూ సేకరణ చివరి దశకు చేరుకుందని వారు తెలుపుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) అధికారులు పారిశ్రామికవాడ భూములను పరిశీలించారు. పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రభుత్వం 1,177.35 ఎకరాలకు నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. అధికారులు నేటివరకు 658 మంది పట్టాదారులకు సంబంధించిన 914.12 ఎకరాల భూమిని సేకరించారు. పోలేపల్లి గ్రామంలో 48 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం టీజీఐఐసీకి అప్పగించారు. వాటికి పరిహారంగా దాదాపు రూ.180 కోట్ల వరకు చెల్లించారు. భూ సేకరణ పోలేపల్లిలో పూర్తి కాగా లగచర్ల, హకీంపేట్ రెవెన్యూ గ్రామాల్లో ఇంకా 263.23 ఎకరాలు సేకరించాల్సి ఉంది.


హద్దుల నిర్ధారణకు వేసిన పసుపు రంగు

ఇక కంపెనీల ఏర్పాటు

ఇప్పటివరకు సేకరించిన భూముల్లో ప్రభుత్వం త్వరలో కంపెనీల ఏర్పాటుకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఫార్మా ఏర్పాటు రద్దు చేసిన నేపథ్యంలో ఎలాంటి కంపెనీలు ఏర్పాటు చేస్తారో అనే చర్చ కొనసాగుతోంది. కాలుష్య రహిత కంపెనీలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

ఉపాధి పండుగ

కంపెనీలు నిర్మాణ పనులు ప్రారంభమైతే నియోజకవర్గంలోని కూలీలకు, 10వ, ఇంటర్ స్థాయిలో చదువుకున్న వారికి సూపర్‌వైజర్‌లుగా ఉపాధి లభిస్తుంది. స్థానిక కాంట్రాక్టర్లకు సైతం చేతినిండా పనులు దొరుకుతాయని భావిస్తున్నారు. కంపెనీల నిర్మాణ దశలో వేల సంఖ్యలో కూలీలు అవసరం ఉంటుందని, ఇక్కడి ప్రాంత వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేయాల్సిన అవసరం లేదనే సంతోషంలో ఉన్నారు.

సేకరించిన భూ వివరాలు

పారిశ్రామవాడ ఏర్పాటుకు ప్రభుత్వం 1,177.35 ఎకరాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా పోలేపల్లి గ్రామంలో 38 మంది రైతుల నుంచి 73.39 ఎకరాల అసైన్డ్ భూమితో పాటు 48 ఎకరాల ప్రభుత్వ భూమిని అదనంగా స్వాధీనం చేసుకున్నారు. హకీంపేట్‌లో 172 మంది రైతులకు సంబంధించి 261.33 ఎకరాల అసైన్డ్, 143.21 ఎకరాల పట్టాభూమి, లగచర్ల రెవెన్యూ పరిధిలో 64 మంది రైతులకు సంబంధించి 72.26 ఎకరాల అసైన్డ్, 212 మంది రైతుల నుంచి 314.13 ఎకరాల పట్టా భూమిని అందించారు. ఇప్పటికే 862.02 ఎకరాలు సేకరించిన అధికారులు మరో 263.23 ఎకరాలు సేకరించాల్సి ఉందని చెప్పారు.

సేకరణకు రైతులు అనుకూలం



రైతులతో మాట్లాడుతున్నాం. త్వరలో మిగిలిన భూమి సేకరిస్తాం. రైతులు అనుకూలంగా ఉన్నారు. అన్నదమ్ముల, తాతల భాగాల్లో తేడా ఉన్నందున సరి చేసుకుని ఇస్తామని చెబుతున్నారు. వారితో నిరంతరం మాట్లాడుతున్నాం.

– కిషన్, తహసీల్దార్ దుద్యాల్

రైతు భరోసాలో కత్తెర

- నగానికి సగం భూమి తగ్గించి రైతుల ఖాతాలో నగదు జమ
- లబోదిబోమంటున్న అన్నదాతలు

ధారూరు: ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నగదుపై మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో పలు అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొన్నారు. పట్టా పాసు పుస్తకాల్లో ఉన్న భూ విస్తీర్ణం కంటే తక్కువగా భరోసా డబ్బులు తమ ఖాతాల్లో జమ అయ్యాయని గురువారం మండిపడ్డారు. అందులో మచ్చుకు.. తరిగోపుల గ్రామానికి చెందిన అల్లాడ రాంచంద్రారెడ్డికి 1.33 ఎకరాల పొలం ఉంటే కేవలం 29 గుంటలకే రైతు భరోసా డబ్బులు వచ్చాయి. రూ.10,950కి బదులుగా రూ.4,350 ఖాతాలో జమ అయ్యాయని వాపోయాడు. అంతా పంట పొలమే అయినా మొత్తం డబ్బులు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే.. ప్రభుత్వం చేయించిన ఆన్‌లైన్ సర్వే ప్రకారం నగదు జమ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేయడం గమనార్హం. అదే గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు సైతం భూమి ఎక్కువ ఉంటే డబ్బులు సగానికి సగం తగ్గించి వేశారని లబోదిబోమంటున్నారు.


1.33 ఎకరాలకు 29 గుంటలే రైతు ఖాతాలో జమ అయిన నగదు

వెంటనే జమ చేయాలి

పట్టా పాసుపుస్తకాల్లో ఎన్ని ఎకరాలు ఉంటే అంతకు భరోసా నగదు జమ చేయాలి. సాగు చేసిన పొలానికి సైతం పెట్టుబడి సాయం అందక పోవడం బాధాకరం. రైతు భరోసాలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాం. శాసనసభ స్పీకర్ ఈ విషయంలో తగిన చొరవ తీసుకుని పొలం ఉన్నంత మేర డబ్బులు వేయించాలి.

– జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు

బీదర్ టు హైదరాబాద్

- గంజాయి అక్రమ రవాణా
- నలుగురు యువకుల అరెస్ట్
- ఐదు కిలోల గంజాయి స్వాధీనం

రాజేంద్రనగర్: బీదర్ నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నించిన నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కారుతో పాటు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్‌కు చెందిన జగదీష్, నరేందర్, చింతల్‌మేట్‌కు చెందిన రామ్‌కుమార్ స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలైన వీరు బీదర్ వెళ్లి గంజాయిని తీసుకొచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కారులో బీదర్ వెళ్లిన వారు మహేశ్ అనే వ్యక్తిని సంప్రదించగా అతను రూ. 40 వేలకు ఐదు కిలోల గంజాయిని విక్రయించాడు. సరుకు తీసుకుని నగరానికి వస్తుండగా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు గురువారం మధ్యాహ్నం కారును ఆపి సోదా చేయగా ఐదు కిలోల గంజాయిని గుర్తించారు. కారుతో పాటు గంజాయిని సీజ్ చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.గంజాయి విక్రయించిన మహేశ్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

కోడలిపై కత్తితో మామ దాడి

బంజారాహిల్స్: కోడలిపై కత్తితో దాడికి పాల్పడిన మామను జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... శ్రీకృష్ణానగర్‌లోని సీ బ్లాక్‌కు చెందిన అరుణ్ ప్రసాద్ ప్రైవేట్ ఉద్యోగి. అతడికి భార్య జయలక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన అరుణ్ ప్రసాద్ ప్రతి రోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. అంతేగాక జయలక్ష్మి మామ చిల్లర వెంకటేశ్వరరావు కూడా కోడలిని అసభ్యంగా దూషిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. బుధవారం ఉదయం కోడలితో గొడవపడిన వెంకటేశ్వరరావు కూరగాయల కత్తితో ఆమెపై దాడి చేయడంతో మెడ వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను యూసుఫ్‌గూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. తన భర్త అరుణ్ ప్రసాద్ మద్యం మత్తులో తనపై దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అరుణ్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించేందుకు యత్నిస్తుండగా అతను తీవ్ర భయాందోళనకు లోనయ్యాడు. చేయని తప్పునకు బలవుతున్నానంటూ పోలీసుల ముందు కన్నీరుమున్నీరయ్యాడు. దీంతో పోలీసులు ఆరా తీయగా కత్తితో దాడి చేసింది తాను కాదని తన తండ్రి అని చెప్పాడు. దీంతో వారు బాధితురాలిని పలు కోణాల్లో విచారించగా మామ వెంకటేశ్వరరావు తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పింది. ఎందుకు అబద్ధం చెప్పావని ప్రశ్నించగా అంత పెద్ద వయసులో ఆయన జైలుకు వెళ్లడం ఇష్టం లేదని అందుకే అబద్ధం ఆడినట్లు భార్యా, భర్తలు ఒప్పుకున్నారు. తన తండ్రే తల్లిపై దాడి చేశాడంటూ అంతకు ముందు ముగ్గురు కొడుకులు కూడా పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు నిందితుడు వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాలు తారుమారు చేసినందుకు అతడి కుమారుడు అరుణ్‌ప్రసాద్‌పై కూడా కేసు నమోదు చేశారు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత

నిందితుడి అరెస్ట్

మేడ్చల్: గంజాయిని చాక్లెట్లు విక్రయిసున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అతడి నుంచి 5 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండ్లపోచంపల్లి పరిధిలోని అయోధ్య చౌరస్తా వద్ద రూట్ వాచ్ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన జయరామ్ మిశ్రా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడి వద్ద చాక్లెట్ల గంజాయి చాక్లెట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లో వాటిని కొనుగోలు చేసిన అతను నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ నవనీతతో పాటు ఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ రిమాండ్

కాచిగూడ: ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో రౌడీషీటర్‌ను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావేద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్పతో కలిసి వివరాలు వెల్లడించారు. యాకత్‌పురా, బడాబజార్‌కు చెందిన షేక్ ఖదీర్ యాకుత్‌పుర రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్ ఫారం దాటుతుండగా మాదన్నపేట, చౌని ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ అబ్దుల్ సోహైల్‌తో పాటు అతని అనుచరులు డబ్బులు, సెల్‌ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. షేక్ ఖదీర్ అందుకు నిరాకరించడంతో అబ్దుల్ సోహైల్ కత్తితో అతనిపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కాచిగూడ రైల్వే పోలీసులు ప్రధాన నిందితుడు మహ్మద్ అబ్దుల్ సోహైల్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు ముదస్సిర్, ఆయన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

దోపిడీ కేసులో నిందితుల రిమాండ్

కాచిగూడ: ప్రయాణికుడిపై దాడిచేసి అతడి నుంచి నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, వివరాలు వెల్లడించారు. మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో కనకయ్య అనే వ్యక్తి ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి నగదు, మొబైల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన బతుకమ్మ కుంట ప్రాంతానికి చెందిన దాసరి మౌనిక, పోతుగల్ ప్రాంతానికి చెందిన బి.సుక్కయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి సెల్‌ఫోన్, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

మణికొండ: కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ మహిళ భవనం 4వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ, సాయిరాం కాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిరాం కాలనీలోని ఆర్‌కే రెసిడెన్సీలో అన్నపూర్ణ(58) తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటోంది. గత కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి లోనైన ఆమె భవనం నాలుగవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

శ్రీ హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ

యాచారం: భక్తిభావం ఉన్న చోట ప్రజలు సంతోషంగా ఉంటారని, పసిడి పంటలు సస్యశ్యామలంగా ఉంటాయని శ్రీ హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ పేర్కొన్నారు. తక్కళ్లపల్లి తండాలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో గురువారం వార్షికోత్సవంలో స్వామిజీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తిభావం పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. నూతన దేవాలయాల నిర్మాణం, పూరాతన దేవాలయాలను అభివృద్ధి చేయడం కోసం కృషి చేయాలన్నారు. పర్వతారోహకుడు అంగోత్ తుకారం చిన్నతనంలోనే బంగారు మైసమ్మ దేవాలయాన్ని నిర్మించి ఘనంగా నిత్య పూజలు, ఏటా వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగోత్ తుకారాం, మానస దంపతులతో పాటు కుటుంబ సభ్యులు రాందాసు, జంకు, వెంకటేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


వార్షికోత్సవ పూజలో విద్యారణ్య భారతి

రసీదులు తప్పనిసరి

చేవెళ్ల: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాధికారి శంకర్‌లాల్ సూచించారు. మండలంలోని సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్‌ల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టార్లను చెక్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుకాణాల్లో ఎప్పటికప్పుడు స్టాక్ నిల్వల వివరాలను బోర్డులపై పెట్టాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదును అందించాలని సూచించారు. నాణ్యత లేని విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చేవెళ్లలో ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ శంకర్‌లాల్

వసతుల కల్పనకు కృషి

అమెజాన్ సీఎస్ఆర్ విభాగాధిపతి తాతాజీ


సోలార్ గ్రిడ్‌ను ప్రారంభిస్తున్న అమెజాన్ ప్రతినిధులు

షాబాద్: పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండాలని అమెజాన్ సీఎస్ఆర్ విభాగాధిపతి తాతాజీ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్ గ్రిడ్‌ను పర్యావరణవేత్త లిబోకోహెన్, రాజేష్‌మైసా, రీజనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వినయ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా, వైద్యం కోసం అమెజాన్ వెబ్ సర్వీసు ఎంతో ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో షాబాద్‌లోని ఆదర్శ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా సంస్థ మౌలిక వసతులు కల్పించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, అమెజాన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.